క్లుప్తంగా

మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




చిలకలూరిపేట: హుదా సొసైటీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని గుర్రాలచావిడి వీధిలోని హుదా సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి 100 మంది పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించి, 23 మందికి కళ్లజోళ్లు అందజేయనున్నారు. కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన 33 మందిని శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తీసుకువెళ్లి శస్త్రచికిత్సలు చేయించనున్నారు. కార్యక్రమంలో హుదా సొసైటీ అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వి, షాదీఖానా అధ్యక్షుడు సయ్యద్ బషీర్ మేస్త్రి, రిటైర్డ్ వీఆర్వో చల్లా విజయ్‌కుమార్, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల సిబ్బంది కె.మంజుభార్గవి, ఎం.నాగరాజు, జె.శరణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలి



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని అందుగుల కొత్తపాలెం వద్ద సోమవారం నాడు ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తితో పాటు 30 గొర్రెలు మృతి చెందిన సంఘటనలో కొడుకును, ఉపాధిని కోల్పోయిన కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతయ్య, సీపీఎం నాయకులు పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన కుర్రా తిరుపతయ్య తల్లిదండ్రులు గాలయ్య, రమణలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేతికి అందివచ్చిన కొడుకును ప్రమాదంలో కోల్పోయామని, జీవనాధారమైన 30 గొర్రెలు కూడా మృతి చెందాయని, మరికొన్ని గొర్రెలు గాయపడి ఆర్థికంగా చితికిపోయామని వాపోయారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 30 లక్షలు నష్టపరిహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, కె.హనుమంతరెడ్డి, జి.నవీన్‌కుమార్, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడు రాంబాబు మృతి



శావల్యాపురం: స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు, గాయత్రి మెడికల్ షాపు యజమాని రావిపాటి సీతారామచంద్రమూర్తి అలియాస్ రాంబాబు (65) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. మండల వాసులకు 40 సంవత్సరాలుగా నిరంతరం అందుబాటులో ఉండి పేదలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఆయన అకాల మృతికి ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, సొసైటి సీఈవో జాలాది నాగప్రసాదు, చెరుకూరి ప్రసాదు, కర్రె పెద అంజయ్య, జవంగుల బాబు, చిట్టేటి రవి, ఆర్ఎంపీ వైద్యులు వజ్జా పున్నారావు, దాసరి ప్రభాకరరావు, ముట్లూరి నాగబాబు, మనోహర్, జక్కా నాగ శ్రీనివాసరావు, బొందిలిపాలెం మాజీ సర్పంచులు జుజ్జూరి ఐరామమూర్తి, బత్తుల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పద్మనాభుని హనుమంతరావు, రెడ్డి వెంకట గోపాల కృష్ణారావు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు గ్రామస్తులు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు రెడ్డి జన సేవా సమితి ముందుకు వచ్చింది. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన ఉయ్యూరు వెంకటరెడ్డి భార్య అనూరాధ మెదడు క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం ఆస్తి మొత్తం అమ్ముకొని ఇబ్బందులు పడుతున్నారు. ఇది తెలుసుకున్న పట్టణానికి చెందిన రెడ్డి జన సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, సభ్యులు భవనం నాగిరెడ్డి, అచ్చిరెడ్డి చేతుల మీదుగా గురువారం ఆ దంపతులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



బహుమతుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన జనం



మోకులాగుడు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



బహుమతుల్ని పంపిణీ చేస్తున్న సినీ నటులు డాక్టర్ చిట్టిబాబు

విజేతలకు విలువైన బహుమతులు

యడ్లపాడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రచ్చబండ సెంటర్లో మూడు రోజులు ఏర్పాటు చేసిన క్రీడా సాంస్కృతిక పోటీలు ముగిశాయి. పలు అంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. రంగవల్లులు, మోకులాగుడు, లెమన్ అండ్‌స్పూన్, స్కిప్పింగ్, బక్కెట్‌బాల్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం అట్టహాసంగా కొనసాగింది. ఈ సందర్భంగా కోలాటం, అభినయ గీతాలాపన, పద్యాలతో కళాకారులు అలరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటులు డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ భార్గవి చౌదరి, అరికెపూడి పృథ్వీ గాంధీ, ముత్తవరపు రామారావు, ఆలోకం పెద్ద అబ్బయ్య, ఎం.కృష్ణమూర్తి, జరుగుల శంకరరావు హాజరై బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

ముగ్గుల పోటీలో లక్ష్మి ప్రియాంక, సుకన్య, రూపశ్రీ, కుండకొట్టుడులో యశస్వి, తాన్య, మనస్వి, మోకులాగుడులో రజినీ, భారతి, విశ్వప్రియ జట్లు, స్కిప్పింగ్‌లో నందిత, కిరణ్ సాయి, యశస్వి, లెమన్ అండ్ స్పూన్ జస్వంత్, వాత్సల్య, భవిష్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నగదు, బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్నారు.

నూజెండ్లలో వైభవంగా తిరునాళ్లు


వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



స్వామివారి దర్శించుకున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో మూల విరాట్



వైస్సార్ సీపీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీరామయోగయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు గురువారం అత్యంత వైభవంగా గ్రామస్తులు ఆలయ కమిటి సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వేకువజాము నుంచి స్వామివారిని పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకించి విశేష పూజలు అనంతరం స్వామివారిని పూలదండలతో ఆలయ పూజారి మేదరమెట్ల రామసుబ్బయ్య అలంకరణ చేశారు. గ్రామంలోని నలుదిక్కులు ఏర్పాటు చేసిన పాదుకలకు మేళతాళాల నడుమ వైభవంగా 108 బిందులతో గ్రామస్తులు ఐక్యంగా జలాభిషేకం చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. నియోజకవర్గంలో తొలి తిరునాళ్ల కావటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో పూలదండలతో ముస్తాబు చేశారు. మూడు విద్యుత్ ప్రభలతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు సారథ్యంలో ఎస్ఐ వైవీ కృష్ణారావు పోలీసు సిబ్బందితో శాంతి భద్రతలు పర్యవేక్షించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి పార్టీ శ్రేణులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నక్కా నాగిరెడ్డి

వినుకొండ (నూజెండ్ల): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్లవారిపాలెం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి మాట్లాడుతూ మారెళ్ళ వారిపాలెం ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాల నుంచి క్రికెట్ పోటీలు క్రమం తప్పకుండా నిర్వహించటం అభినందనీయమన్నారు. అదే విధంగా ప్రతి ఏడాది క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలు జరపడం శుభపరిణామన్నారు. అనంతరం మొదటి బహుమతి ఈదర గ్రామ క్రీడాకారులకు రూ.30 వేలు నగదు అందజేశారు. రెండవ బహుమతి గొల్లపాలెం టీం వారికి రూ.20 వేలు యక్కంటి నారాయణ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారెళ్ళ నాగిరెడ్డి, ఎంపీఎల్ కార్య నిర్వాహకులు మారెళ్ళ కృష్ణారెడ్డి, నూజెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షులు పిచ్చిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ డిపో గ్యారేజ్ నందు రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వినుకొండ ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టౌన్ ఎస్ఐ ఎస్‌కె. సమీర్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ సమీర్‌బాషా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

నకరికల్లు: విద్యుత్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న ట్రూఅప్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, బిల్లులు పెంచబోమని పాలకులు హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారన్నారు. భారీగా విద్యుత్ బిల్లులు పెంచడం దారుణమన్నారు. సన్న, చిన్నకారు రైతులు, పేద, మధ్యతరగతి వర్గాలు ఈ బిల్లులతో సతమతం అవుతున్నారని అన్నారు. ప్రభుత్వం బిల్లులపై అదనంగా విధిస్తున్న ట్రూఅప్ చార్జీలు తొలగించాలన్నారు. విద్యుత్ బిల్లుల పెంపును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వినియోగదారుల పక్షాన ఉద్యమం చేస్తామని అన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలో విద్యుత్ శాఖ ఆపరేషన్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నరసరావుపేట ఆపరేషన్ ఈఈ సీహెచ్ రాంబోట్లు, డీఈఈ/డీపీఈ కె.రవికుమార్ పర్యవేక్షణలో 47 బృందాలుగా అధికారులు 3,444 సర్వీసులను పరిశీలించారు. 149 మంది వినియోగదారులు నిబంధనలు ఉల్లంఘించారని గుర్తించారు. వారికి రూ. 6.57 లక్షలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.రాజశేఖర్, బి. వెంకటేశ్వరరెడ్డి, జీఎల్‌వీ ప్రసాదరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డివిజన్ పరిధిలోని ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

చిలకలూరిపేట: సుదీర్ఘ చరిత్ర కలిగిన అఖిల భారత యువజన సమాఖ్య పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలు ఈ నెల 21వ తేదీన వినుకొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు సౌటుపల్లి చిన్నబాబు, కె.మల్లికార్జున్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా వినుకొండలో భారీ ర్యాలీతో పాటు శివయ్య స్థూపం సెంటర్లో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహాసభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అమరావతి రాజధానిని ఫ్రీ జోన్‌గా చేయాలని విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవడంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భవిష్యత్ పోరాటాలు రూపొందించుకొని ముందుకు సాగడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పంటలతో అధిక రాబడి

జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

ఈపూరు(శావల్యాపురం): అంతర్ పంటల ద్వారా రైతులకు అధిక రాబడి వస్తుందని జిల్లా ప్రకృతి అధికారులు వెల్లడించారు. గురువారం మండల కేంద్రమైన ఈపూరులో ప్రకృతి వ్యవసాయ రైతులు సాగు చేసిన మేడికొండ భాస్కరరావు, ఏడుకొండలు పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య మాట్లాడుతూ భూమిలో వివిధ రకాల పంటలు సాగు చేయటం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. రైతులకు నిరంతరం ఆదాయం లభిస్తుందన్నారు. రైతులందరూ అంతర్ పంటల విధానం ఆచరించటం ద్వారా నష్టాలనుంచి అధిగమించవచ్చునన్నారు. అంతేకాక ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే ఎరువులు బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, రైతులు సొంతంగా తయారు చేసుకోవటం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా రసం పీల్చే పురుగులు, మచ్చల పురుగులు, తెగుళ్ల ఉధృతి పూర్తిస్థాయిలో నియంత్రణ చేయవచ్చునన్నారు. దీంతో భూమిలో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. అంతర్ పంటల్లో భాగంగా గోరుచిక్కుడు బెండ, సజ్జ, అలసంద, కీరదోస, మినుము, కంది, దోస, జొన్న తదితర అంతర్ పంటల ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, ప్రకాష్ రావు, రైతులు పాల్గొన్నారు.

సేవకు ముందుకు రావడం అభినందనీయం



లోగోను ఆవిష్కరిస్తున్న సొలొమోను రాజు తదితరులు

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు బోధనల ద్వారా ప్రజలను ఆధ్యాత్మికం వైపు నడిపిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలను కె.యస్.సాగర్ నిర్వహించడం అభినందనీయమని శ్రీకాకుళానికి చెందిన బైబిల్ ఉపాధ్యాయులు కె.వి.ఆర్ సొలొమోను రాజు అన్నారు. 'నిత్యజీవము' పేరుతో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్ ఒకటవ లైన్ అంబేడ్కర్ రోడ్డులోని ఖాళీ స్థలంలో ఏసుక్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15వ తేదీల్లో జరిగిన క్రీస్తు సువార్త సభలలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బైబిల్ పఠనం, ఆధ్యాత్మిక గీతాల ఆలాపనతో ఏసుక్రీస్తును ఆరాధించారు. వాక్య సందేశాన్ని పలువురు ఆలకించారు. కె.యస్.సాగర్ ఏర్పాటు చేసిన లవ్ యువర్ గాడ్ మినిస్ట్రీస్, లవ్ యువర్ నైబర్ అనే ట్రస్టు లోగోలను కె.వి.ఆర్. సొలొమోనురాజు గురువారం ఆవిష్కరించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ జి. కరుణకుమార్, ఏపీ డీజీపీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కె.నవీన్ చైతన్య కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది పెండెం బాబురావు, సభల కన్వీనర్లు కె.యస్.సాగర్, పి.లోకేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. మొత్తం 40 మంది హాజరై, పాఠశాలలో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సరదాగా గడిపారు. అప్పటి గురువులైన ఎ.తిరుమలేష్, రమేష్, నాగేశ్వరరావు, సుబ్బారావు, చిరంజీవి, రాధాకుమారి, అరుణకుమారిలను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి భోజనాలు చేసి సందడి చేశారు.

హైస్కూలుకు వాటర్ ప్లాంటు వితరణ

పెదకూరపాడు: పెదకూరపాడు మండల పరిధిలోని 75త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 5 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంటును గురువారం అందించారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఉమాసుందరి జ్ఞాపకార్థం భర్త సింహాద్రి లీలాప్రసాదరెడ్డి, కుమారులు మనోదిలీప్ రెడ్డి, రాజీవ్ రెడ్డిలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనూ ఉమాసుందరి సోదరులు గుత్తికొండ శివసుందర్ రెడ్డి, జొన్నల శ్రీరామ్ పాపిరెడ్డిలు పాఠశాల అభివృద్ధికి అవసరమైన ఫర్నీచర్, ప్రింటర్, కంప్యూటర్లు, కాఫీ మెషిన్, నీటి సౌకర్యం కల్పించడం జరిగిందని వెల్లడించారు.

డాక్టర్ భార్గవరెడ్డిని కలిసిన మాజీ మంత్రి అంబటి



డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డితో మాజీ మంత్రి అంబటి

నరసరావుపేట: సత్తెనపల్లి నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డితో మాజీ మంత్రి అంబటి రాంబాబు సమావేశమయ్యారు. గురువారం స్థానిక అరండల్‌పేటలోని భార్గవరెడ్డి నివాసానికి గుంటూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డితో కలిసి వచ్చారు. సమన్వయకర్తగా నియమితులైనందుకు భార్గవరెడ్డికి శుభాకాంక్షలు తెలియచేశారు. రాష్ట్ర, నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను గురించి చర్చించారు. పార్టీని బలోపేతం చేసి మళ్లీ జెండా ఎగురవేసేందుకు అందరమూ సంయుక్తంగా కృషిచేయాలని నిర్ణయించారు. తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా కోడిపందేల నిర్వహణ



బోయపాలెంలో బరిలో సాగుతున్న పందేలు



తలపడుతున్న కోళ్లు

యడ్లపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోనే యడ్లపాడు మండలం కేంద్ర బిందువుగా కోడి పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి, కనుమ రెండురోజులు పాటు బోయపాలెంలోని ఏపీ గురుకుల పాఠశాల సమీపంలో వీటిని నిర్వహించారు. భోగి పండుగ రోజునే కంచెల్ని ఏర్పాటు చేసుకున్నారు. అడిగిన అందరికీ అనుమతులు వచ్చాయనే పుకార్లు చేశారు. కూటమి ప్రధాన నాయకులు కనుసన్నల్లో ఉదయం 10 నుండి సాయంత్ర 6.00 వరకు నిర్విరామంగా కోడిపందేల నిర్వహణ కొనసాగింది. పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేయడంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి పందెంరాయుళ్లు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. రెండు రోజులపాటు పందేలు నిర్వహించగా తొలిరోజు 30, రెండోరోజు 50 జతలు పోటీబరిలోకి దిగాయి. బరిలో దిగిన ప్రతి పుంజు యజమాని నుంచి రూ.1000 చొప్పున వసూలు చేశారు. పందెంలో గెలిచిన వారి నుంచి మరో రూ.1000 వసూలు చేశారు. నిర్వాహకులు బరుల వద్ద ఫోటోలు, వీడియోలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విలేకర్ల మీద నిఘా పెట్టడానికి కొందరిని ఉంచారు. బరి వద్దకు వచ్చిన వారందరికీ ఫోటోలు, వీడియో తీసుకోకుండా పదేపదే హెచ్చరికలు చేశారు. పైపాకెట్‌లో కాని, చేతుల్లో ఫోన్లు ఉన్న వారిని నిర్మోహమాటంగా బరివద్ద నుండి పంపించేశారు. పందేల నిర్వహణ గురించి జిల్లాస్థాయిలో మార్మోగినా, తమకేమీ తెలియదన్నట్లు సదరు రెండు రోజుల మాత్రం పోలీసులు అటువైపు కన్నెత్తి చూడనే లేదు. కోడిపందేలు మొదలుకుని ఎలాంటి జూదాలకూ అనుమతుల్లేవని, ఎవరైనా ధిక్కరిస్తే అదుపులోకి తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయడం తప్ప..క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నూరుశాతం అంగవైకల్యం ఉందా? లేదా?

బొల్లాపల్లిలో వైద్యబృందం పరిశీలన



సరికొండపాలెంలో లబ్ధిదారుడిని పరిశీలిస్తున్న వైద్యబృందం

బొల్లాపల్లి: వైద్య, ఆరోగ్య శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో నూరు శాతం అంగవైకల్యం కలిగిన పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు వైద్యబృందం గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మండలంలోని గండిగనుమల, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, నాయుడుపాలెం, వెల్లటూరు తదితర పంచాయతీల్లో నూరు శాతం అంగవైకల్యంతో పింఛన్ పొందుతున్న 16 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరందరిని వైద్యబృందం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పరిశీలించారని ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య తెలిపారు. గుంటూరు, విజయవాడ ప్రభుత్వ వైద్యశాలల నుంచి వచ్చిన వైద్యబృందం ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులను కలిసి వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. వీరందరికీ ప్రతినెలా ఒక్కొక్కరు రూ.15 వేలు వంతున పింఛన్ పొందుతున్నారని, వీరిలో అర్హులు, అనర్హులను గుర్తించేందుకే ప్రభుత్వ కార్యచరణలో భాగంగా ఈ వైద్యబృందం పరిశీలన చేసిందని, వైద్యబృందం నివేదిక ఆధారంగా వీరి అర్హతను గుర్తించి అనంతరం తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం నుంచి యథావిధిగా పింఛన్ అందుతుందని వైద్యబృందం నివేదిక ప్రకారమే నిర్ణయం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

21న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): అఖిల భారత యువజన సమాఖ్య (ఏ.ఐ.వై.ఎఫ్) రాష్ట్ర 22వ మహాసభలు శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా ఏఐవైఎఫ్ ప్రథమ మహాసభలు ఈ నెల 21వ తేదీన వినుకొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తెలిపారు. స్థానిక శివయ్య భవన్‌లో రాష్ట్ర మహాసభల గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ 21న పట్టణంలో ర్యాలీ నిర్వహించి శివయ్య స్థూపం సెంటర్లో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహాసభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భవిష్యత్ పోరాటాలు రూపొందించుకొని ముందుకు సాగడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు షేక్. గౌస్, ఖాసిం, మరియబాబు, మనోహర్, అభిషేక్, యనూష, లాజర్, ఏఐవైఎఫ్ మాచర్ల ఏరియా కార్యదర్శి రంగ స్వామి పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలో గురువారం ప్రారంభ సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ అధ్యక్షత వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రహదారి నియమాలు పాటిస్తే ప్రమాదాలు ఉండవన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, పాల్గొన్నారు.